సంక్రాంతి సంకెళ్లు



వేదుల మీనాక్షీదేవి

"మే. వ. అక్కయ్యకు నమోవాకములు.

నీవు వ్రాసిన వుత్తరం అందింది. శ్రీను, పూర్ణా నిన్ను తలచుకోని క్షణంలేదు.

నేను ఇన్నాళ్ళూ దూరాన వుండడంచేత ఏ పండుగలకూ మనం అంతా ఒకచోట చేరి ఆనందించటానికి వీలు కలుగ లేదు. ఈ సంక్రాంతి పండుగకు బావగారు, నువ్వు, పిల్లలు ఇక్కడికి రావలసింది. బావగారు ఎప్పుడూ తీరిక లేదంటారు. ఎలాగో తీరిక చేసుకురమ్మని చెప్పవలెను. పండుగనాడు కూడా ఏంపని వుంటుంది బాబూ ఆయనకు! ఒకవేళ ఆయనకు వీలులేకపోతే ఒక్కర్తెవైనా నువ్వూ, పిల్లలూ వచ్చి నాకు విందు చేసి వెళ్ళవలెనని కోరుతున్నాను.

ఢిల్లీనుండి పెద్దన్నయ్య వచ్చాడు. తమ్ముడికి సెలవు దొరకదేమో అని వ్రాశాడు.

సంక్రాంతి పండుగకు సంకెళ్లలోని వాళ్ళూ వస్తారన్నప్పుడు నీకే సంకెళ్లూ లేవు గనుక తప్పక రావలసింది. బావగారితో మరీ మరీ చెప్పవలెను.

......రావు."

మా తమ్ముడు రావు పండగ పిలుపు వుత్తరం వచ్చింది. నా మనస్సు ఆనందంతో నిండిపోయింది. ఎంత పెద్దవాళ్ళయినా, ఎంత కుటుంబీకురాలైనా పుట్టింటివారు వచ్చినా, పుట్టింటివారు రమ్మన్నా ఏ స్త్రీ మనస్సు ఝుమ్మనకుండా వుంటుంది? ఒక్కచోట పుట్టి జ్ఞానం వచ్చేదాకా ఒక్కచోట పెరిగి ప్రాణానికి ప్రాణంగా వుంటే ఏకోదరులు కొంత కాలానికి చెట్టుకో పిట్ట అన్నట్లు విడిపోతారు. ఆడపిల్లలు పెళ్లిళ్లయి అత్తవారిళ్లకు పోతారు. మగపిల్లలు మొదట చదువులకని యింట్లోంచి వెడతారు. తరువాత ఉద్యోగాలకు సరేసరి; ఈ రోజులలో విసిరేసినట్లే వెడుతున్నారు దేశంలో ఏ మూలకో.

మా పెద్ద తమ్ముడు ఢిల్లీలో ఉద్యోగం చేస్తున్నాడు. రెండవ తమ్ముడు రావు దూరపువూళ్ళు తిరిగి తిరిగి చివరకి యీ మధ్యనాలుగైదు మాసాలైంది, యీ ప్రాంతాలకి వచ్చాడు. మూడవతమ్ముడు బొంబాయిలో పనిచేస్తున్నాడు. వాడికి సెలవులేని వుద్యోగం. సంకెళ్ళలోని వాళ్ళకైనా విడుదల వుంటుంది కాని, వాడికి విడుదలలేదు. పండగకు ఒకటి, రెండురోజులు సెలవు వచ్చినా యింటికి వచ్చి వెళ్ళడానికి అధమం వారంరోజులైనా వ్యవధి వుండాలి. ఈ విధంగా అంతా తలొకచోటా విసిరేసినట్లున్నాం. ఒకళ్ళం, యిద్దరం కలుసుకున్నా తృప్తిగా వుండడం లేదు. అంతా ఒక్కమారైనా ఒక్క చోటవుండే పరిస్థితి తటస్థించటంలేదని బాధగా వుంటోంది మా అందరికీ కూడా. చిన్నప్పటిలాగ అమ్మా, తమ్ముళ్లూ, నేను అంతా కలిసి వుండాలనిపిస్తూంటుంది. కాని ఎలా సాధ్యం అవుతుంది? నా కోరిక

★ సంక్రాంతి...సంకెళ్లు ★

కోరికగానే నిలిచిపోయింది.

ఇదే సృష్టి చిత్రం అంటారు పెద్దలు. భగవంతుని కిదంతా ఒక క్రీడ అని కూడా అంటారు.

పండగకు వెళ్ళాలనే వుందిగాని, చుట్టుపక్కన యింటికి తాళంపెట్టి వెళ్ళే చిన్న సంసారం కాదు నాది. అమ్మాయీ, అల్లుడూ పండగకివచ్చారు. పెద్దబ్బాయిపండగకంటూ ముందేవచ్చాడు. చిన్నవాడు "పెద్ద పండగనాటికి యింట్లో వుంటాను" అని వ్రాశాడు. అందరినీ పండగకి రమ్మని నేను మా పుట్టింటికంటూ యెలా వెళ్ళను? నేను వెడితే వాళ్ళేంగాను? అమ్మాయి వక్కర్తె చెయ్యగలదా? రాక రాక వచ్చిన పిల్లకు పండగపూట నువ్వెడన్నం విస్తట్లో పెట్టకుండా వంటగిన్నె చేతికిస్తానా? అన్నివిధాల ప్రాధేయపడుతూ "ఒక్కరోజైనా పండగకు వచ్చి మాకు నిండు చెయ్య"మని వ్రాసిన రావు మనస్సు క్షోభపడుతుంది నేను వెళ్లకపోతే. అదీ నాకు బాధే.

"రావు రమ్మని వ్రాశాడు పండగకి" అంటూ మావారికి నా తమ్ముడు వ్రాసిన వుత్తరం యిచ్చాను.

ఉత్తరం చదువుకుని నవ్వుకున్నారు. "మహారాజులాగ నువ్వు వెళ్ళవచ్చు. నిన్ను పంపడానికి యిదివరకు అభ్యంతర పెట లేదు. ఇప్పు డభ్యంతర పెటడం లేదు. ఇక ముందు అభ్యంతర పెట్టబోను," అని నన్ను పంపడానికి తమకుగల నిరభ్యంతరాన్ని భూతభవిష్యద్వర్తమానాలలో వెలవిచ్చారు శ్రీవారు. (ఈ వాక్యాని కీయనకి గుడ్ కాన్టక్ట్ ప్రైజ్ యివ్వవచ్చు.)

"మిమ్మల్ని మరీ మరీ రమ్మని వ్రాశాడు. పిల్లల్ని కూడా తీసుకురమ్మన్నాడు. పండగపూటా యిల్లు తాళంవేసి అంతా వెళ్లడం యెలాగ? సంవత్సరానికోమారు వచ్చే పెద్ద పండగ యిది. ఎంతమందో యిల్లు కనిపెట్టుకున్నవాళ్ళుంటారు. పండగనాడు వాళ్ళ చేతులలో తలో కాస్తా యేదైనా చేసి పడెయ్యకుండా, దేవుడికి ధూపదీప నైవేద్యాలు లేకుండా చెయ్యడం నామనస్సుకేమీ బాగాలేదు. పోనీ నేను వుండదా మంటే పిల్లల్ని మిమ్మల్ని యిబ్బంది పెట్టాలి. నాకేమీ కర్తవ్యం తోచడం లేదు" అన్నాను.

"అంతా వెళ్ళడం కుదరదు. ఒక్కరోజు నువ్వు వెళ్లి వచ్చెయ్యి. నేను, అమ్మాయి యెలాగో తంటాలు పడుతాము మిగిలిన రెండురోజుల పండగకీ నీకు తోచినన్ని పిండివంటలు కూతురికీ, అల్లుడికీ, మాకూ చేసి పెడుదువు గాని. అలాగయినట్లయితే మీ తమ్ముడికీ తృప్తిగా వుంటుంది. మాకూ లోటుండదు. రేపు మొదటి బస్సులో వెళ్ళి యెల్లుండి మొదటి బస్సులో వచ్చెయి. ఈ సంసార ఝంఝాటన యెప్పుడూ వుండేదేను. హాయిగా వెళ్ళి రా" అంటూ నా ప్రయాణం నిశ్చయించారు. మా పిల్లలుకూడా 'వెళ్ళ'మని వాళ్ళ నాన్నగారి సూచనను సమర్థించారు.

"సరే" అన్నానే కాని నా మనస్సు మనస్సులో లేదు. వెళ్లాలనీ ఉంది; మానాలనీ వుంది.

"నా ప్రయాణం సంగతి ఏం చెయ్యమంటావే" అన్నాను మా పనిమనిషి అచ్చితో.

అది మామూలు పనిమనిషి లాంటిది కాదు. అదీ మాకుటుంబంలో ఒక సభ్యురాలుగానే భావిస్తాం మేము. పదిహేనేళ్ళ నుండి మా యింట్లో పనిచేస్తోంది. మా పిల్లలందరినీ యించుమించుగా అదే పెంచింది. వాళ్ళనేమీ మేము అనడానికి వీలులేదు. ఎప్పుడయినా వాళ్ళు అల్లరి పని లేక కేక లేస్తే "నేను బతికుండగానే వాళ్ళని తిడతావా?" అంటూ ఏడిచేది. నన్నూ, మావారినీ కూడా ఏకవచన ప్రయోగమే చేస్తుంది. "అమ్మాయీ", "అబ్బాయీ" అని పిలుస్తుంది. మమ్మల్ని కంటికి రెప్పలా కాపాడుతోంది. అవసర మయినప్పుడు అది సలహా యివ్వటం కూడా కద్దు. అందుకే దాన్ని సలహా అడిగా ప్రయాణం గురించి.

"అమ్మాయీ, నేను ఇవతల పను లన్నీ చూస్తాను తలంటి నీళ్లుపోస్తాను చక్కగా నువ్వు వెళ్ళి నీ తమ్ముడు దగ్గిర ఒకరోజు వుండిరా. పిల్లల కేలోటూ రానివ్వను," అంటూ వెళ్ళడానికి నన్ను ప్రోత్సహించింది.

రాత్రిభోజనా లయాయి. తెల్లవారి మొదటిబస్సు ఆరుగంటలకే బయలుదేరుతుంది. మా చిన్నపిల్ల నన్ను విడిచివుండలేదు. దానినికూడా తీసుకుని వెళ్ళడానికి నిశ్చయించుకున్నాను.

"తెల్లవారుజామున లేవవలసి వుంటుంది. పెందరాళే నిద్రలేకపోతే తల తిరుగుతుందంటావు నువ్వు" అని మావారు హెచ్చరిక చేశారు.

రాత్రి యెనిమిది గంటలయింది. చెప్పవలసిన వన్నీ చెప్పి అచ్చిని యింటికి పంపేశాను. తరవాత ఓ రెండుగంటలు యింటి సవరింపులతో సరిపోయింది.

* * *

సరిగ్గా ఆరుగంటలకు బస్సు బయలుదేరింది. శీతాకాలం అవడంవల్ల యింకా నాలుగుప్రక్కలా వెలుగే రాలేదు చలిగా వుంది. పైగా కారువేగానికి మరీ యెక్కువైంది చలి. బస్సుస్టాండులోనే జనం చాలా మంది రావడంవల్ల బస్సు నిండుగా బయలుదేరింది. అక్కడక్కడ ఆగవలసిన అవసరం



చర్మబాధలకన్నిటికి

"సైబాల్"

చర్మవ్యాధు లన్నిటిని శీఘ్రంగా నివారణచేసి, విష క్రిమి నాశనియై త్వరితంగా కుదుర్చుటలో "సైబాల్" ప్రసిద్ధికెక్కింది. కురుపులు, గజ్జి, ఎక్జిమా, స్కాబిస్, మొటిమలు, తామర, కాలిపగుళ్లు, వ్రణములు, మొదలైన వాటిని కుదుర్చడంలో అద్భుతంగా పనిచేస్తుంది.

బిడ్డల ఆరోగ్యమునకు ప్రసిద్ధిచెందినది.

"రమణీస్ బేబీ గ్రైప్"

తయారుచేయువారు:

ది సౌత్ ఇండియన్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ, మధుర.

డిస్ట్రిబ్యూటర్లు:

సీతారామ జనరల్ స్టోర్సు ఏజన్సీస్

విజయవాడ, సికింద్రాబాద్.

బరంపురం (గంజాం), బొంబాయి. బెంగుళూరుసిటీ.

లేక పోవడంవల్ల చాలా వేగంగా వెళుతోంది. ఆనందంతో పుట్టింటికి వెళ్ళే ఆడపడుచుల తోను, అత్తవారిళ్లకు వెళ్ళే అల్లుళ్లతోనూ ఆ బస్సు కలకలలాడుతోంది.

బస్సు బయలుదేరి సుమారు గంట కావస్తోంది.

"ఎక్కడికమ్మా వెడుతున్నావు?" అంది ఒక ముసలమ్మ

"మా పుట్టింటికి" అన్నాను.

"పండగకా?" అంది.

"ఔను" అన్నాను.

"ఎంతమంది పిల్లలు" అంది మా చిన్న పిల్లని చూస్తూ. చెప్పాను. వాళ్లంతా యింటి దగ్గరవున్నారనీ నే వెడుతున్నాననీ చెప్పే సరికి ఆవిడ ముఖం చూసి తీరవలసిందేగాని వర్ణించలేను ఎందుకో అంత ఆశ్చర్యం, నాకు అర్థం కాదు.

"ఇంత మంది పిల్లలున్నారంటున్నావు. అల్లుడు వచ్చాడంటున్నావు. అందరినీ వదలి పండగ పూటా యేమని వెడుతున్నారు? నీ ప్రాణం యెలాగ వొప్పిందమ్మా. నీ ఆనందమే కాని వాళ్ల ఆనందం గొడవ నీ కక్కర్లేదల్లేవుందే! వెళ్లిదలచుకుంటే పండుగ అయాక వెళ్లలేక పోయావు?" అంది గబగబా.

ఈమె నెవరడిగారు సలహా? ఏదో పోనీ కదా పెద్దది అని వూరుకున్నాను. నా కంటె మంచీ చెడా తెలియదా? ఎంత ఆలోచించి బయలుదేరడం జరిగింది! నాపిల్లలమీద నా కన్న ఎక్కువ ప్రేమవుందా యీ విడకు? ఈమధ్య వాళ్లంతా నా పిల్లల్ని సుఖపెడతారా? అని అనుకుని నామనస్సు సమాధాన పరచుకున్నాను.

ఎనిమిదిన్నరకు వెంకటనగరం చేరుకున్నాం. ఆవూరు క్రొత్తదే అయినా రావు అక్కడికి వచ్చాక ఆమధ్య నొకమారు వెళ్లడంచేత యిల్లు తెలుసుకోగలిగాను. అక్కడ బళ్లేగాని, రిక్షాలు లేవు. మా బండీ సంధు మలుపులో వుండగానే శ్రీను, పూర్ణా గుర్తుపట్టి, యెదురు వచ్చారు. నేను మా చిన్నమ్మాయీ బండీ దిగగానే పూర్ణా, శ్రీను నా చెరో చెయ్యీ చెరో కాళ్ళూ పట్టుకుని నా మీద ప్రశ్నోపాఖ్యానం యెందుకు [illegible] చెప్పు" అని నిగదీశారు.

రావు అప్పుడే గుమ్మం దిగబోతున్న వాడల్లా నన్ను చూసి "అదేమిటి! బస్సు అప్పుడే వచ్చిందా. బస్సుదగ్గరికి వద్దామనే బయలుదేరుతున్నాను" అంటూ మా పిల్లను చేత్తో పట్టుకుని లోపలికి తీసుకెళ్లారు. నేను లోపల గుమ్మంలో అడుగు పెట్టేసరికి మా మరదలు గొంతు వినిపించింది. "వదిన వచ్చేసిందే. ఎవరినా వెళ్లారా లేదా కారుదగ్గరకి" అంటూ.

పిల్లలతోనూ, పసుపుకుంకాలతోనూ పెళ్ళి కళ వచ్చింది యింటికి. మామిడాకు తోరణాలు, మధ్య మధ్య పచ్చని ముద్దబంతి పువ్వులతో చాలా అందంగా వున్నాయి గుమ్మాలకి. వీధి అరుగులు మొదలు పెరటివరకూ సున్నంతో ముగ్గులు తీర్చినట్టుంది మరదలు. చూడ ముచ్చటగా వుంది.

పావిట్లో మా పెద్దతమ్ముడు, మూడవ తమ్ముడూ, రావు పెద్దకొడుకు రఘు, పెద్ద పిల్ల శశి తలంటి నీళ్లుపోసుకుని రెండవమారు కాఫీతాగుతున్నారు. చిన్నతమ్ముడు వస్తాడనుకోలేదు. తమ్ముళ్ళిద్దరూ నన్ను చూడగానే "అక్కా వచ్చావా" అంటూ యెదురువచ్చి ఆప్యాయంగా చెరో భుజంమీద చెయ్యి వేసి దగ్గరగా నిలబడ్డారు. ఇంతలో "అక్క వచ్చిందట్రా?" అంటూ అమ్మ వచ్చి ముగ్గురు కొడుకుల మధ్య వున్న నన్ను చూసింది. ఆమె కళ్ళల్లో నీరు గిర్రున తిరిగింది. ఆనందాశ్రువులవి "ఎన్నాళ్ళయిందే అమ్మా నా బిడ్డలందరూ ఒక చోట చేరి" అంటూ కళ్లు వొత్తుకుంది మాకూ కంఠ పూర్తి అయింది. రెండేళ్ళయింది వాళ్ళని చూసి, అమ్మకూడా కొడుకుల దగ్గర వుండడంచేత నాకు చూడ్డంపడలేదు మా అందరి గొంతులూ పూడిపోయి మాట రాలేదు. అమ్మను వళ్ళి కౌగలించుకోవాలనిపించింది. కాని, ఆమె మడికట్టుకుంది

ఇన్నాళ్ళకి అంతా ఒక చోట సమావేశమయాం, అనుకోని సన్నివేశం. నే నెక్కడికి వెడితే అక్కడికి వస్తున్నారు తమ్ముళ్లూ, పిల్లలూ, వాళ్ళ బావగారినీ, పిల్లల్ని తీసుకు రాలేదనీ, మా అల్లుణ్ణి దూరానవున్న తమ్ముళ్ళిద్దరూ చూడలేదనీ, మేమంతా వస్తాం అనుకున్నారనీ ఏవేవో అంటున్నారు తమ్ముళ్లు. నాకవేమీ వినబడ్డంలేదు. మనస్సులో చెప్పలేని ఆనందం. హృదయం, తేలిక అయినట్లనిపించింది వాళ్ళందరినీ చూసేటప్పటికి, పిల్లలు నా చుటూ తిరిగి ఆడుతున్నారు.

మా చిన్నపిల్ల, నేను తలనీళ్ళు పోసుకున్నాం. నేనూ మా మరదలు పులిహోర, బొబ్బట్లు చేశాం. అమ్మ వంట వండింది.

రావడం, అందరినీ చూడడం అయింది. చాలా ఆనందంగానే వుంది. అయితే యేమి? మనస్సు ఇంటివేపే వుంది. పిల్లలేం తంటాలు పడుతున్నారో పెదవాడికి అప్పుడప్పుడు జొన్న, జొన్న చొప్పున భోజనం అయ్యే లోగా నాలుగుమాట్లు కాఫీ త్రాగడం అలవాటు. ఈ రాత్రికి చిన్నవాడు వస్తాడు. రాగానే "అమ్మేది" అంటాడు నేను కనబడకపోయేసరికి, మూడవ పిల్లాడు ఎవరిచేతా తలంటిపోయించుకోడు. ఎవరు పోసినా కుంకుడుకాయ పులుసు కంట్లో పడుతుంది. కళ్లు యెర్రబడి నానా బాధా పడతాడు పాపం. నేను పోస్తే తల పైకి యెత్తి, పులుసు ముఖం మీదికి రాకుండా జాగ్రత్తగా రుద్దుతాను. నేనూరికి వెడుతున్నానని తలనీళ్లు యివాళ మాని రేపు నేను వచ్చాక పోసుకుంటానన్నాడు. అంటే నేను "నాబాబు కదూ. పండగనాడు అందులో భోగినాడు తప్పకుండా తలంటి పోసుకోవాలి. లచ్చి జాగ్రత్తగా పోస్తుంది" అని ఒప్పించాను. పాపం, కళ్లలోగాని

తరచుగా మూత్రం వెలువడుచున్నదా?

చక్కెరతోగాని లేక చక్కెర లేకుండాగాని తరచుగా మూత్రము వెలువడుట మిక్కిలిప్రమాదకరమైన చిహ్నము శరీరాన్ని గుల్ల చేయడమే కాకుండా యీ వ్యాధి తనబంధంలో చిక్కిన వారిని ఆరోజుకారోజు మృత్యువుకు ఆసన్నుని చేయును ప్రథమదశలో శారీరక మానసిక శ్రమలకు యిచ్చగించకుండుట, నడుములో నొప్పి, చూపు మాంద్యము తొడల్లో తిమ్మిరి నరముల బలహీనతతో యీ వ్యాధి పొడచూపును పై లక్షణములతోకూడిన వ్యాధికి వెంటనే తగిన చికిత్స చేయించకున్నచో అధికదాహం ఆకలి, గొంతు నోరు యెండుట దురదలు కాళ్ళలో పగుళ్లు తూకంతగ్గడం శరీరమంతా పోట్లు కీళ్ల నొప్పులు. కంటిపొరలు, తీయ గడ్డలు రాచపుండ్లు యిట్టి భయంకర బాధాకరమైన వ్యాధులు యెన్నో సంభవింపవచ్చును

"వీనస్‌ఛారమ్" మాత్రలు వాడి. అనేక వేలమంది తమబాధల నుండినివారణపొంది మృత్యుకరాళమునుండి రక్షింపబడిరి "వీనస్ ఛారమ్" శాస్త్రీయ పద్ధతులమీద, ప్రాచీన యూనానివైద్యవిధానప్రకారం అమూల్య ఓషధుల శాకపదార్థముల, స్వాభావిక క్షారముల సారముతో తయారైనవి. మూత్రములో పంచదార, పలుమారు మూత్రవిసర్జనచేయు అవసరము 2 లేక 3 రోజులలోనే మీకు చాలాభాగము నివారణగును కొద్ది రోజులలోనే మీకు సగానికిపైగా స్వస్థత చేకూరినట్లనిపించును. "వీనస్ ఛారమ్" కొద్ది వ్యయముతో, సుఖముగా తేలికగా సేవించవచ్చును. దీనికి ప్రత్యేకపథ్యము లేదు నిరాహారముతో నుండే అవసరంలేదు రోగులు పుష్టికరమైన ఆహారము తినేందుకై రోగులు యిదివరకటికంటె యెక్కువరకాల ఆహారపదార్థములు తీసికొనవచ్చును వివరములు గల ఇంగ్లీషు కరపత్రములు అడిగినచో ఉచితముగా పంపబడును ధర: 50 మాత్రల సీసా రు. 6-75 ప్యాకింగు పోస్టేజీ ఉచితము

లభించు స్థలము:

Venus Research Laboratory (A. P. W)

P O Box No 587, Calcutta

★ సంక్రాంతి...సంకెళ్లు ★

పులుసు పడిందో యేమో. ఏం తంటాలు పడుతున్నారో యింట్లోవాళ్లు. పిల్లకి వంట అట్టే చేతకాదు, ఏదో కాలక్షేపం చేస్తుంది అవసరంవస్తే. అంత [illegible], అన్నం వండుకుని తింటారు. అల్లా ఏ పిండివంటా లేకుండా మామూలు భోజనమే యివ్వాళ. అందరికీ వండి, వడించేసరికి అమ్మాయి కేమి నీరసం వచ్చిందో. పాపం అచ్చి పెద్దదై పోయింది. అంద - నీళ్ళు పోస్తానంది పోయ్యనూ పోస్తుంది, కాని, ఓపిక యేదీ? నన్ను పంపాలి కదా అని బరువుపని తనమీద వేసుకుంది. ఓ కాఫీ చుక్కైనా అమ్మాయి నరిగ్గా త్రాగిందో లేదో, అమ్మాయితో చెప్పడం మరచిపోయా నా సంగతి. అచ్చి నోరు తెరిచి ఏదీ అడగదు. మనం పెడితే పుచ్చుకుంటుంది.

ఈ విధమైన ఆలోచనలతో నా బుర్ర వేడెక్కి పోయింది. మనస్సు చాలా బాధ పడుతోంది. ఇన్నాళ్ళకి మా అమ్మ సంతానం అంతా కలుసుకున్నాం అనే ఆనందం ఒకవైపున, ఇంట్లోవాళ్ళ గురించిన బాధ మరోవైపున వుంది నాకు.

భోజనాలయేసరికి పన్నెండయింది. ఇంట్లోవాళ్లం యెవరైనా ఒకచోట వుంటే అంతా అక్కడ పోగైపోవడం, మాకు అలవాటు. నేనూ, మా మరదలూ కూర్చుని తాంబూలం వేసుకుంటున్నాం. మా అమ్మవచ్చి నా దగిరగా కూర్చుని నామీద చెయ్యివేసి నిమురుతోంది. ఎంత పెద్దవాళ్ళయినా పిల్లలు తల్లులదృష్టిలో చిన్నవాళ్లలాగే కనిపిస్తారు గదా అని నవ్వువచ్చింది నాకు. మా తమ్ముళ్ళు ముగ్గురూ వచ్చారు. రఘు, [illegible] నావళ్ళో పడుకున్నారు. శ్రీను నావీపుమీద వాలిపడ్డాడు. పూర్ణ నా కుడిప్రక్కని కూర్చుంది. వీళ్ళంతా నాదగ్గిర కూర్చోవడం దూరాన నిలబడి విస్తుపోయి చూస్తోంది మా చిన్నపిల్ల. అదే చిన్నపిల్ల అవడంచేత అదే నా దగ్గిర వుండాలిగాని యెవరూ నా దగ్గిరకు రాకూడదు. పైగా వీళ్ళ నెవరినీ అది అట్టే యెరుగదు. అందుచేత బొత్తిగా నన్ను వదలడంలేదు. పిల్లలతో మాత్రం ఆడుతోంది. ఒకటి రెండుమార్లు యిదీ, శ్రీను, పూర్ణా తగాదా పడ్డంకూడా అయిపోయింది. నామీద వాళ్ళకిగల ప్రేమ చేత దానిని కనికరించారు.

చిక్కమొహంవేసి "నాకొత్త పరికిణీ నాకు తీసియ్యి పెట్టెలోంచి. నువ్వే లేచివచ్చి యియ్యాలి" అంది. ఎలాగైనా వాళ్ళమధ్య నుండి నన్ను యివతలకు తీసుకు వచ్చెయ్యాలని దానివ్యూహ, "అలాగే యిస్తాలే" అని దాని దగ్గరగా కూర్చోపెట్టుకున్నాను.

"అత్తా యిలా చూడు!" అని నా ముఖం తనవైపునకు తిప్పుకుంది పూర్ణ.

"ఎందుకు?" అన్నాను.

"మీవూరు సంకెళ్లా" అంది.

"అదేమిటే" అన్నాను అర్థంగాక.

"కాదులే మరి నాన్నెమో నీకు ఉత్తరం వ్రాసి అమ్మకు చదివి వినిపించాడు. అప్పుడు సంకెళ్లలో వాళ్లు వస్తారు" అని చదివాడులే అందుకని అంది పూర్ణ.

"అదా సంగతి! ఔను, "సంకెళ్లలో వాళ్ళుకూడా వస్తారే పండగనాడు. నీకు సంకెళ్ళు యేమీ లేవుకనుక తప్పక రావాలి" అని మీ నాన్న వ్రాశాడు. అది నీవు వూరు పేరు అనుకున్నావా అమ్మా" అన్నాను నవ్వుతూను. అంతా నవ్వుతున్నారు. దానికి కోపం వచ్చింది. ఏడుపు ముఖం రాబోయింది

"వాళ్ళంతేనమ్మా. పండగనాడు ఏడవ రాదు. వాళ్ళు వట్టి అల్లరివాళ్ళు" అని దాన్ని వూరుకోపెట్టాను.

(46-వ పేజీ చూడండి)

సంక్రాంతి-సంకెళ్ళు

(16-వ పేజీ తరువాయి)

ఇంత సందడిగావున్నా నా మనస్సంతా యింటిమీదేవుంది.

మా రావు కాపురంవున్న యింట్లో యింకా ఆరు యిళ్ళవాళ్ళున్నారు. ఏ వాటాకి ఆవాటా కేటాయింపుగావుంది. ఎవరితోనూ యెవరికీ పొమ్మడిలేదు.

నేను వచ్చినట్లు క్షణంలో తెలిసింది వాళ్ళకి. భోజనాలూ పనులూ అయాక ఒక్కొక్కరేవచ్చి "వచ్చారా" అంటూ నన్ను పలకరించారు. ఇదివరకు వచ్చాను కనుక వారికి నేను తెలుసును.

"పాపం. పండగపూటా పిల్లలు వండుకుంటున్నట్లున్నారు." అంటూ మా పిల్లల మీద సానుభూతి కనబరిచారు కొందరు.

"అలుడు కూడా వచ్చినట్లున్నాడు. అతన్ని పండగకు పిలిచి మారిలాగవస్తే మా అలుడికి కోపంవచ్చి మా అమ్మాయిని తీసుకుని చక్కా పోడుగదా పండగ అవకుండానే" అంది ఒక యిల్లాలు వినీవినబడనట్లుగా.

గతుక్కుమన్నాను "మా వాళ్లంతా అంగీకరిస్తేనే వచ్చాను" అన్నాను.

"అందరినీ తీసుకురాలేకపోయారా? ఏకంగా పండగలయాక వెళుదురు?" అంది ఒక యిల్లాలు.

"అల్లాగ కుదరదండి" అన్నాను.

"పోనీ వీళ్లందరినీ మా యింటికే రమ్మనలేకపోయారా? ఎవరికీ ఏ బాధా లేకపోను, ఇంతకీ మాకే వీరందరికన్నా పెద్దకదా. మీరు పిలిచి రమ్మన్నా ఏ ఆక్షేపణా లేకపోను?" అంది ఒక మహిళ.

వచ్చిన అమ్మలక్కలు వెళ్ళిపోయారు.

"ఎంతటి యిల్లాలే! భర్తనీ, పిల్లల్నీ, పండక్కి వచ్చిన అల్లుణ్ని పండగపూటా వాళ్ల ఖర్మకి వాళ్ళని వదిలేసి తిరుగుతున్నామ్మ అని వచ్చింది" అంటూ పోతూపోతూ వాళ్లనుకున్న మాటలూ, తరువాత పకపకలూ వినిపించాయి.

అసలే యింటిమీద ధ్యాసతో మనస్సు బాగాలేని నాకీ మాటలు చాలా బాధ కలిగించాయి. చటుక్కున లేచి రావుని కేక వేశాను. "సాయంత్రం బస్సు సరిగా యెప్పుడు బయలుదేరుతుంది" అని.

"అదేమిటి?" అని ఆశ్చర్య పోయారంతా.

"రేపు ప్రొద్దుటి దాకా వుంటానన్నావు కదూ అక్కా" అన్నారు తమ్ముళ్ళు.

"అప్పుడేనే అమ్మాయీ వెళ్ళడం. ఆ కారుకి వచ్చి యీ కారుకి వెళ్ళడం మగవాళ్ళకి చెల్లిందిగాని ఆడవాళ్లం అలాగ వెళ్లడమేమిటే" అంది అమ్మ.

"పండగ అంటూ మూడు రోజులూ వుండకపోయి నా ఒక్కరోజైనా పూర్తిగా వుండరా వదినా" అంది మరదలు.

"వెళ్ళవద్దు అత్తా" అన్నారు యిద్దరు మేనల్లుళ్ళు, యిద్దరు మేనకోడళ్ళును.

వాళ్లలా ప్రతిమాలుతున్నా ఒక్క నిముషం యిక అక్కడ నిలవలేకపోయాను.

"వెళ్ళక తప్పదర్రా, ఎన్నాళ్ళున్నా నాకూ వుండాలని వుంటుంది. మీకూ అలాగే వుంటుంది. రావడం, నలుగురినీ చూడడం అయింది. మళ్ళీ త్వరలో నే వస్తా" అంటూ నా ప్రయాణ నిశ్చయం తెలియజేశాను. ఏమీ చెయ్యలేక వాళ్లూరుకున్నారు.

పిల్లలేమీ చేసుకోనివుండరని మా మరదలు బొబ్బట్లూ నిన్న చేయించివుంచిన మిఠాయి వుండలు ఒక పజబుట్టలో పెట్టి యిచ్చింది "వాళ్ళకి పెట్టండి" అని "రేపు నేనివన్నీ చేస్తా"నన్నా వినిపించుకోలేదు.

* * *

మా వూరు చేరుకునే సరికి ఏడు గంటలయింది. ఆలిండియా రేడియో నుండి తెలుగు వార్తలు ప్రసార మాతున్నాయి. బస్సు స్టాండులో బోలెడు రిక్షాలుండేవి. అదేమో ఒక్క రిక్షా లేదు! మా యిల్లు అక్కడికి దగ్గరే అయినా రిక్షామీదే వెడుతూంటాం సాధారణంగా ఏదో సామానూ వుంటుంది.

ఇక నడిచి వెళ్ళవలసిందే. చిన్న పిల్లని యెత్తుకోనక్కర్లేదు. నడుస్తుంది. కాని, బుట్ట?

పాటం కట్టియిస్తే తీరిపోను. బజారు బుట్టలాంటిది యిచ్చింది మరదలు! ఏం చెయ్యను. ఒకచేత్తో పిల్లను, మరొకచేతో బుట్టనీ పట్టుకుని యెవరైనా తెలిసినవాళ్లెదురు పడతారేమోనని జడుస్తూ రోడ్డు వారగా నడుస్తున్నాను. ఎలక్ట్రిక్ దీపాల కాంతిలో వీధులు పట్టపగల్లాగ వున్నాయి. చేతిలోని బుట్ట యెవరికీ కనబడకుండా చీరచెంగు బుట్ట మీదుగా కప్పివుంచాను. మా సందులోకి మళ్ళాను. అంత దూరాన మా యిల్లు కనబడుతోంది.

"అమ్మా ఆకలేస్తోంది" అంది పిల్ల.

"మిఠాయి తింటావా? యిస్తాను. అరవబోకు" అన్నాను.

"వాకు యిప్పుడే" దంది.

దానికి తీపికిట్టదు. ఆమాట మరచిపోయి అడిగాను.

ఇంతలో యెదరనుండి మావారి స్నేహితుడు శర్మగారు సైకిల్ మీద వస్తున్నారు మా వైపే. ఇక రెండుయిళ్ళే మా యింటికి మధ్య వున్నాయి. ఇంతలోకే యీయన కనబడాలా? చేతిలో బుట్టతోచచ్చిన చావయింది. దీపస్తంభం క్రీనీడ అదృష్టవశాత్తూ మామీద పడుతోంది. మేము ఆయనను చూశాం. కాని, ఆయన మమ్మల్ని చూడలేదు. ఎక్కడికో హడావిడిగా వెడుతున్నట్లున్నాడు. "బ్రతుకు జీవుడా" అనుకుని రెండు అంగల్లో మా యింటికి చేరుకున్నాను.

లోపల భోజనాలవుతున్నట్లుంది. వీధి వైపు సందడిలేదు.

"అమ్మాయి తలుపుతియ్యి" అని గట్టిగా పిలిచాను.

* * * *

"అమ్మాయీ, తలుపుతియ్యి" అన్న అచ్చి పిలుపుతో కళ్లు తెరిచాను. నా చేతిలో బుట్టాలేదు! నేను వీధి గుమ్మంలోనూ లేను! మంచం మీద పడుకునివున్నాను. నా పక్కలో చిన్నపిల్ల పడుకుని హాయిగా నిద్రపోతోంది.

లేచి గడియారం చూశాను. తెల్లవారుజాము అయింది. 5 గంటలయింది జనం సంచరిస్తున్న సందడి అవుతోంది. కాకులు "కావు కావు" మంటూ, రెక్కలు విదలిస్తూ గూళ్లలోంచి బైటకి వస్తున్నాయి.

వెళ్ళి వీధి తలుపు తీశాను అచ్చికి.

బస్సులో ముసలమ్మ అన్నమాటలూ, రావుగారింట్లో యిరుగు పొరుగు అమ్మలక్కలు అన్నమాటలూ, వాళ్ల నవ్వులూ నా చెవుల్లో యింకా ప్రతిధ్వనిస్తూనే వున్నాయి.

"అమ్మాయీ, ఇప్పుడేనా వెళ్లడం?" అంది అచ్చి.

"ఆఁ! నేనెక్కడికి వెళతానే" అన్నాను నిశ్చింతగా.

* * *

సంక్రాంతినాడే కాదు. మనస్సుకి ఏనాడూ లేవు సంకెళ్ళు. ★

స్కినడెక్స్
గజ్జి, దురదలు, పుండ్లు మొ॥
చర్మవ్యాధులకు దివ్యాంజనము
శ్రీవత్స కెమికల్స్ & డ్రగ్స్
లిమిటెడ్, మద్రాసు-30.

నారసింహ లేహ్యము

బంగారుతో చేరినది. మేహము, నిశ్శక్తి, నిస్సత్తువ వగైరా హరించి బలము రక్తవృద్ధి కలిగించును 20 తు డబ్బీ రు. 3-4-0. పోస్టేజిరు 1-1-0

ఎ. ఎ. ఎ. అండ్ కంపెనీ ఆయుర్వేద సమాజం, పెండేవి (PO) నెల్లూరుజిల్లా.